క్లుప్తంగా

ధాన్యం కొనుగోలుపై మైత్రీ సమావేశం

నల్లజర్ల: మండలంలో ధాన్యం కొనుగోలుపై మైత్రీ సమావేశం జరిగింది. తహసీల్దారు కిశోర్ కుమార్, ఎంపీడీఓ రాజశేఖరం, వ్యవసాయాధికారి కమల్‌రాజ్, సివిల్ సప్లయి డీటీ సత్యనారాయణరావు, రైస్‌మిల్లర్లు, రైతులు, వీఆర్వోలు పాల్గొన్నారు. 15 రైతు భరోసా కేంద్రాలకు డేటాఎంట్రీ ఆపరేటర్, హెల్పర్, టెక్నికల్ అసిస్టెంట్‌లను నియమించినట్టు వ్యవసాయాధికారి తెలిపారు. 2లక్షల50గోనెసంచులు, రవాణాకు వాహనాలు సిద్ధం చేసినట్టు చెప్పారు. వాహనాలకు జీపీఎస్ సిస్టమ్ అమర్చనున్నట్టు చెప్పారు. గత ఏడాది 9,800 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, ఈ ఏడాది 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నట్టు చెప్పారు. కస్టోడియన్ అధికారిగా నల్లజర్ల ఆర్ఐను నియమించినట్టు చెప్పారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కేశవ

కొవ్వూరు: పట్టణానికి చెందిన గెల్లా కేశవ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. అధిష్టానం నుంచి నియామక ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. బీజేపీ నాయకులు బుధవారం స్థానిక పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మంటపంలో కేశవను సత్కరించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మజ్దూర్ సెల్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగాను, జిల్లా కార్యవర్గ సభ్యుడిగాను ఆయన పనిచేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కేశవ ప్రకటించారు. కొరగంటి సతీష్,గోపిశెట్టి భువనేశ్వరీ,బూసి సురేంద్రనాథ్‌బెనర్జీ, మట్లా ఆంజనేయులు,మడిచర్ల రామచంద్ర రావు,కొండపల్లి రత్నసాయి పాల్గొన్నారు.

బీఎస్పీ అభ్యర్థులు అసెంబ్లీలో అడుగు పెట్టాలి

ఉండ్రాజవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోకి బీఎస్పీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా అడుగు పెట్టాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు బి.పరంజ్యోతి అన్నారు. ఉండ్రాజవరంలో బహుజన చైతన్య సభ బుధవారం నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. బీఎస్పీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మర్రి మహాలక్ష్మడు, మండల అధ్యక్షుడు డొల్లా జాషువా పాల్గొన్నారు.

భవానీలను ఢీ కొన్న మోటార్ సైక్లిస్ట్

దేవరపల్లి: కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి విజయవాడ ఇంద్రకీలాద్రికి కాలినడకన వెళుతున్న భవానీలను దేవరపల్లి మండలం యర్నగూడెం గండి చెరువు వద్ద బుధవారం మోటార్ సైక్లిస్ట్ ఢీ కొన్నాడు. భవాని, యర్నగూడెంకు చెందిన మోటార్ సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడ్డారు. 104 అంబులెన్స్, ఎస్‌హెచ్ 1033 అంబులెన్స్‌లో చికిత్స కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు.

ప్రజా సమస్యలు తెలుసుకొనేందుకే జేకేసీ

- జాయింట్ కలెక్టరు తేజ్ భరత్
- నిడదవోలులో 152 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ తేజ్ భరత్. చిత్రంలో ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

నిడదవోలు: ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకుని అక్కడికక్కడే వాటి వివరాలు నమోదు చేయడం కోసం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం (జేకేసీ) అర్జీలను నేరుగా స్వీకరించామని జాయింట్ కలెక్టరు ఎన్.తేజ్ భరత్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన నిడదవోలు పట్టణ, మండల స్థాయిలోలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, డీఆర్వో జి.నరసింహులు, కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ పంచాయతీ, వైద్య ఆరోగ్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ, భూ సంబంధ, హౌసింగ్ తదితర శాఖలకు చెందిన మండల స్థాయి స్పందనలో 152 అర్జీలను స్వీకరించామని పేర్కొన్నారు. ఇందులో నిడదవోలు రూరల్ పరిధిలోనివి 70 కాగా, అర్బన్ పరిధిలో 82 అర్జీలు ఉన్నాయన్నారు. ప్రతి బుధవారం మండల స్థాయిలో జేకేసీ నిర్వహిస్తామని తెలిపారు. అర్హత కలిగిన అర్జీలకు వారం రోజుల లోగా పరిష్కారం చూపుతామని అన్నారు. వారం లోగా పరిష్కారం కానీ వాటి విషయంలో జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికారి సిబ్బంది వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. మండల స్థాయిలో జరిగే జేకేసీకి ఆయా మండలాలకు చెందిన ప్రజలు హాజరై అర్జీలు ఇవ్వాలని కోరారు. జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకం రీ సర్వే కింద జిల్లాలో 272 రెవెన్యూ గ్రామాలకు గాను తొలి దశలో 45 పూర్తి చేయగా, 2వ దశలో 55 గ్రామాలు, మూడవ దశలో 90 గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందని జేసీ తేజ భరత్ పేర్కొన్నారు. భూమికి హద్దులకు రక్షణ కల్పించడమే రీ సర్వే ప్రధాన ఉద్దేశమన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సంబంధిత తహసీల్దార్లు భూహక్కు పత్రాలను అందిస్తూ ఈకేవైసీ తప్పనిసరి చేస్తున్నామన్నారు. రీ సర్వేలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే పరిష్కంచేందుకు ఆరుసార్లు రీసర్వే పై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. రీ సర్వే కు సంబంధించి మండల స్థాయిలో డిప్యూటీ తహసీల్దారు హోదా అధికారి మొబైల్ మేజిస్ట్రేట్‌ను కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రీసర్వే ప్రక్రియలో వ్యవసాయ భూమి, గ్రామ కంఠం పూర్తి కాగా పుర పాలక సంఘాల్లో డ్రోన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. 2023 డిసెంబర్ చివరి నాటికి వ్యవసాయ భూముల రీసర్వే పూర్తి చేస్తామని, 2023 మార్చి నాటికి సామిత్ర గ్రామ కంఠంకు సంబంధించిన రీ సర్వే ప్రక్రియను పూర్తి చేస్తామని జేసీ తేజ్ భరత్ పేర్కొన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం ద్వారా భవిష్యత్తులో ఎవరూ రికార్డులను తారుమారు చేయకుండా భూమికి సంబంధించిన డిజిటల్ రికార్డులను తయారు చేస్తున్నామన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలనే లక్ష్యం దిశగా జగనన్నకు చెబుదాం, 1902 ద్వారా అర్జీలను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం కోసం వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టి గ్రామంలో వారి ఇంటి వద్దనే పెద్ద ఎత్తున సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. నిడదవోలు పట్టణంలో 13 సచివాలయాలు ఉండగా, ప్రతి గ్రామంలో సచివాలయాలను ఏర్పాటు చేశామన్నారు. 2019 నుంచి స్పందన కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వెను వెంటనే పరిష్కరించే దిశగా నేడు మండల స్థాయిలో జేకేసీకి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇతర జిల్లా అధికారులు హాజరయ్యామన్నారు. పెరవలి, ఉండ్రాజవరంలో కూడా జేకేసీ నిర్వహిస్తామన్నారు. ఇటువంటి వేదికలపై రెవెన్యూ, భూ సంబంధ సమస్యలకు తక్షణ పరిష్కారం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు ఏ సమస్యలు ఉన్నా వాటి పరిష్కారం దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గడప గడపకూ కార్యక్రమాల్లో ఎదురయ్యే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు జేకేసీ చక్కని మార్గమని శ్రీనివాసనాయుడు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, ఎంపీపీ తిరుమళ్ళ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు కొయ్యే సూర్యారావు, తహసీల్దారు ఎం.గంగరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పి.జగదాంబ, ఎస్‌జీటీ సత్య గోవింద్, ఎ.ముఖలింగం, ఎన్‌పీ సత్యనారాయణ, కె.విజయ కుమారి, జి.పరశురామ్, జిల్లా మండల, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కంచికామాక్షి ఆలయంలో 35వ వార్షికోత్సవం



పోతవరంలో జమ్మిచెట్టు వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నల్లజర్ల: మండలంలోని పోతవరం జమ్మిచెట్టు వద్ద కంచికామాక్షి అమ్మవారి ఆలయంలో 35వ వార్షిక ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మహిళలు అమ్మవారిని లలితాదేవి అలంకరణ చేసి జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు సూరిబాబు పూజాధికాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తాతిన సత్యనారాయణ, ఏలేటి తాతాలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. నిరంజన్ దంపతుల ఆధ్వర్యంలో నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. అనంతపల్లి స్వర్ణ దుర్గాశ్రమంలో ఆకుల సత్యప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన భార్య లక్ష్మీదుర్గ, దేవిశెట్టి అరవింద్, మాధురిదీప్తి, కొమ్మెర కాత్యాయిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన జరిగింది. నల్లజర్లలోని వనదుర్గా ఆలయంలో అమ్మవారికి గాయత్రీదేవి అలంకారం చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నవరత్నాలతో ప్రజల్లో సంతోషం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- వడ్లూరులో గడప గడపకూ మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మండలంలో వడ్లూరు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించిన పథకాల గురించి వివరించారు. ఏ ఇంటికి వెళ్లినా అపూర్వ ఆదరణ లభిస్తోందని, ప్రజలు సమస్యలు ఉంటే చెప్పాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అవ్వా పింఛను వస్తోందా, తాతా ఎలా ఉన్నావ్ అంటూ ఆప్యాయంగా పలకరించారు. పథకాల మంజూరులో అర్హులై ఉంటే చాలని, వలంటీర్ల ద్వారా లబ్ధి పొందవచ్చున్నారు. రాష్ట్రంలో అందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే ఉద్దేశంతో మన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ శ్రీనివాసు, ఎంపీటీసీ సభ్యురాలు వేండ్ర అనంతలక్ష్మి, పాలాటి శరత్‌బాబు, బయ్యే సత్తిపండు, రాపాక కొండయ్య, తానేంకి సత్యనారాయణ, కడలి శ్రీను, మల్లుల సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు తీపర్రులో జగనన్న చేదోడు

పెరవలి: మండలంలోని తీపర్రులో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు జగనన్న చేదోడు పథకాన్ని గురువారం ప్రారంభిస్తారని ఎంపీడీఓ దామోదరరావు తెలిపారు. ఈ పథకం ప్రారంభ సమయంలో లబ్ధిదారులు డ్వాక్రా సీఏలు, సీసీలు హాజరవ్వాలని ఆయన కోరారు.

ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం జగనన్న

- హోం మంత్రి వనిత



చాగల్లులో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి వనిత

చాగల్లు: ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. చాగల్లు మండలం చాగల్లు గ్రామం ఇందిరమ్మ కాలనీలో రూ.40 లక్షల వ్యయంలో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని బుధవారం రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత ప్రారంభించారు. హోంమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అట్టడుగున ఉన్న పేద వర్గాలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ సచివాలయ వ్యవస్థను తెచ్చారన్నారు. అవినీతి, లంచాలకు అస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళల ప్రగతికి కృషి చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఎంపీపీ మట్టావీరాస్వామి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్, మండల గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వర రావు, చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఉప సర్పంచ్ మేకా రాజు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె పాషా పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు

గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర హోం మంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చాగల్లు ఎస్సీ ఏరియా, పాటమ్మ గుడి వీధిలో ఆమె బుధవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న పలు అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ఆమె వివరించారు. ఏమైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వనిత మాట్లాడుతూ అర్హత ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమం అందిస్తున్నామన్నారు.

ఆర్‌బీకేల ద్వారా గిట్టుబాటు ధర

- ఎంపీపీ దుర్గారావు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఆర్‌బీకేల వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు రైతులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దళారీ వ్యవస్థకు చెక్ పెట్టడానికి ప్రభుత్వం ప్రతి ఆర్‌బీకే వద్ద కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మండలంలో 15 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. జగనన్న లే అవుట్లలో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని, గృహాలు కట్టుకున్న లబ్ధిదారులకు వెంటనే బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఆయన అధికారులతో సమీక్ష జరిపారు. మండల వ్యవసాయాధికారి కె.విజయ్ మాట్లాడుతూ మండలంలో ధాన్యం కొనుగోలుకు ఆర్‌బీకేల వద్ద సర్వం సిద్ధం చేసినట్టు తెలిపారు. 1.40 లక్షల గోనెసంచులు సిద్ధం చేసినట్టు ఆయన తెలిపారు. పంట కోసిన వెంటనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. దీని కోసం మైత్రి సంఘాలనే ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నట్టు చెప్పారు. మండలంలో 27,500 ఎకరాలకు ఈ– క్రాప్ నమోదు చేసినట్టు తెలిపారు. 5,300 మంది రైతులు ఈకేవైసీ చేయవలసి ఉండగా, 4,900 మంది పూర్తి చేసినట్టు తెలిపారు. ఈ నెల 19 నాటితో గడువు ముగుస్తుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో రూ.3.12 కోట్ల వ్యయంతో పైపులైన్ల నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. ఎంఈఓ తిరుమలదాస్ మాట్లాడుతూ మండలంలోని 45 పాఠశాలలకు జగనన్న గోరు ముద్ద వంటశాలలకు వంట పాత్రలు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసినట్టు తెలిపారు. పీఆర్‌ఏఈ సాజహాన్ మాట్లాడుతూ మండలంలో జెడ్పీ నిధులు రూ.4.84 కోట్లతో 120 పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో రూ.60 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. విద్యుత్ శాఖ ఏఈ కూచిపూడి కృష్ణారావు మాట్లాడుతూ దేవరపల్లిలోని జగనన్న లే అవుట్‌లో రూ.1.10 కోట్ల వ్యయంతో విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. దేవరపల్లికి రూ.కోటి వ్యయంతో 33 కేవీ లైన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

మహాలక్ష్మీ అలంకరణలో దుర్గాదేవికి పూజలు



మహాలక్ష్మీదేవి అలంకరణలో దేవరపల్లిలోని బాలదుర్గమ్మ



తాళ్లపూడిలో శ్రీధనలక్ష్మీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ



అన్నపూర్ణ దేవిగా బ్రాహ్మణగూడెంలోని నాగారమ్మ

దేవరపల్లి: దసరా మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకరణ చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. దేవరపల్లి మండలం బందపురంలోని కోదండ రామాలయం వద్ద గల దుర్గాదేవిని మహాలక్ష్మీ దేవిగా అలంకరణ చేసి భక్తులు కుంకుమ పూజలు చేశారు. దేవరపల్లిలోని బాలదుర్గమ్మ అమ్మవారిని కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవిగా అలంకరణ చేసి భక్తులు పూజలు నిర్వహించారు. స్థానిక మూడుబొమ్మల సెంటర్లోని దుర్గాంబికా అమ్మవారిని, బస్టాండ్ వద్ద గల దుర్గాదేవిని మహాలక్ష్మీ దేవిగా అలంకరణ చేసి కుంకుమ పూజలు నిర్వహించారు.

తాళ్లపూడిలో శ్రీ ధనలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ

తాళ్లపూడి: శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా బుధవారం ఆలయాల్లో ఉదయం నుంచి అధిక సంఖ్యలో మహిళలు, భవానీ మాలధారులు పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. తాళ్లపూడిలోని నవదుర్గా శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో 22వ దసరా మహోత్సవాల సందర్భంగా అమ్మవారిని శ్రీ. ధనలక్ష్మీ దేవిగా అలంకరించారు. అర్చకులు శివప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, సహస్ర నామార్చన, లలితా పారాయణ, పల్లకీ సేవ, హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మలకపల్లిలోని కనక దుర్గమ్మ ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలు

చాగల్లు: స్థానిక మాతంగి చెరువు గట్టుపై ఉన్న కనక దుర్గమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మీనానగరం ముత్యాలదిబ్బ వద్ద గల కనకదుర్గమ్మ ఆలయంలో కంకుమ పూజలు నిర్వహించారు. ఊనగట్లలోని కనకదుర్గమ్మ ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెంలో గ్రామదేవత నాగారమ్మను అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. కోటా వీధిలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు.

ఆర్టీసీ స్థలాల లీజు కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిడదవోలు : నిడదవోలు ఆర్టీసీ డిపో గ్యారేజీకి ఆనుకుని ఉన్న 150 చదరపు గజాలు, 133 చదరపు గజాలు రెండు స్థలాలను ఓఎస్ –15 పథకం ద్వారా 15 ఏళ్ళ పాటు లీజు ఇవ్వడానికి ఔత్సాహిక వ్యాపారవేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.శ్రీరామ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపార వేత్తలకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో ఈ నెల 20న అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

నాటుసారా కేసుల్లో ఇద్దరి అరెస్ట్

కొవ్వూరు: మద్దూరు గ్రామంలో నాటుసారా కాస్తున్న స్థావరంపై దాడి చేసి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఈబీ సీఐ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కవలగొయ్యికి చెందిన మట్టా సతీష్‌ను అరెస్ట్ చేశామన్నారు. మద్దూరులంక గ్రామంలో నాటు సారా కేసులో పరారీ ముద్దాయి కాకరపర్తి రమేష్ కుమారస్వామిని ఎస్సై అడబాల సతీష్ అరెస్ట్ చేశారని ఆయన తెలిపారు.

ప్రజల కోసం ఆరోగ్య సురక్ష



దేవరపల్లిలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దేవరపల్లి: ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లిలో గ్రామ సచివాలయం–11 పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. సర్పంచ్ కడిమి వీరకుమారి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ వైద్యశిబిరంలో 624 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఏడుగురిని రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేసినట్టు తెలిపారు. డాక్టర్లు కె. శ్రీనివాసవర్మ, ఎస్.షణ్ముఖవర్మ, శ్రీనుజ, సీహెచ్ చక్రవర్తి శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ స్టాల్స్‌ను, వైద్య పరీక్షల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డులను ఎమ్మెల్యే వెంకట్రావు పరిశీలించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు పల్లికొండ రామలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కడిమి రాజు, ఐసీడీఎస్ పీఓ వైబీటీ సుందరి పాల్గొన్నారు.

కె.సావారంలో..

ఉండ్రాజవరం: మండలంలో కె.సావారం గ్రామంలో బుధవారం తహసీల్దార్ జి.కనకరాజు ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబరంలో డాక్టర్ రాజనాల ప్రసాద్(ఎండీ) ఆధ్వర్యంలో డాక్టర్ ఇర్ఫాన్ (జనరల్ మెడిసన్), డాక్టర్ ఫణీంద్ర (ఆర్థోపెడిక్), డాక్టర్ తేజ (పిల్లల స్పెషలిస్ట్)లు సుమారు 485 మందికి వివిధ పరీక్షలు నిర్వహించారు. పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, బసవా రామన్నరావు, మీసాల సురేష్, బస్వా శ్రీనివాసు, బస్వా వీరరాఘవులు, సభినాల రామకృష్ణ, సెక్రటరీ హసన్‌జానీ పాల్గొన్నారు.

కానూరు అగ్రహారంలో..

పెరవలి: మండలంలోని కానూరు అగ్రహారంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం ఎంపీపీ కార్పెర్ల ప్రసాద్ ప్రారంభించి, రోగులకు కిట్‌లు అందించారు. శిబిరంలో 604 మందికి పరీక్షలు నిర్వహించగా ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సల నిమిత్తం 20 మందిని రిఫర్ చేశామని స్థానిక వైద్యురాలు తేజశ్రీ తెలిపారు. ఈ శిబిరంలో గైనకాలజిస్ట్, కంటి పరీక్షలు, చిన్న పిల్లల వైద్యులు స్పెషలిస్టులు జి.అశ్విని, సౌందర్య, ఎం.స్వాగత్, ఏఎస్ కృష్ణవేణి, ఎం.జాన్ మిల్టన్ వైద్య సేవలు అందించారు. సర్పంచ్ దాసం వెంకన్న, గ్రామ అధ్యక్షుడు దాసం బాపన్న, పంచాయతీ కార్యదర్శి కుమారి పాల్గొన్నారు.



కానూరు అగ్రహారంలో కిట్‌లను అందిస్తున్న ఎంపీపీ ప్రసాద్, సర్పంచ్, వైద్యురాలు

790 మందికి పరీక్షలు

నల్లజర్ల: నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ప్రకాశరావుపాలెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని గ్రామసర్పంచ్ జాన్‌విక్టర్, ఎంపీటీసీ సభ్యుడు నేకూరి రాజేష్ ప్రారంభించారు. స్త్రీల వైద్య నిపుణులు డాక్టరు శ్రావణి, అష్టమాలజిస్ట్ ఆర్.శాంతి, స్థానిక పీహెచ్‌సీ డాక్టర్లు గంగాధరరావు, రాజశేఖర్ 790మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు.15మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శిబిరాన్ని సందర్శించారు. తహసీల్దారు కిశోర్ కుమార్, ఎంపీడీఓ రాజశేఖర్, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, కరుటూరి లక్ష్మీగణేశ్వరరావు పాల్గొన్నారు.

తొగుమ్మిలో 414 మందికి...

కొవ్వూరు: మండలంలోని తొగుమ్మిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ ఉప్పులూరి విజయలక్ష్మి ప్రారంభించారు. దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు ఆధ్వర్యంలో 414 మందికి వైద్య సేవలు అందించారు. వ176 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహిం చారు. 139 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. 16 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని నిర్ధారించారు. 53 మందికి ప్రసూతి వైద్యం, 99 మందికి ఎముకల సంబంధించిన సమస్యలపై వైద్య సేవలు అందించారు. వైద్యులు సాయికుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వర్మ, కె.ప్రణీత, జి.హరి, బి.శ్రీనివాస్, ఎస్.ధర్మరాజు సేవలు అందించారు.

పల్లెల్లో మెరుగైన వైద్యసేవలు

నిడదవోలు రూరల్: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని డీఎంహెచ్‌ఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. కోరుమామిడిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును సర్పంచ్ అంబటి గోపమ్మ, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి బుధవారం ప్రారంభించారు. శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ ఎం.శాంతకుమారి, కొవ్వూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సంధ్యలు పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. తాడిమళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు జి.సుధీర్‌కుమార్, దివ్య పర్యవేక్షణలో స్పెషలిస్ట్ డాక్టర్లు 379 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు వరిగేటి సౌజన్య, వైఎస్సార్ సీపీ నాయకులు కె.శేషు, ఉప్పల కాశీ, రాపాక వెంకట్రావు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

నిడదవోలు : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి బుధవారం తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్ సచివాలయం పరిసర ప్రాంత ప్రజలు ఈ వైద్య శిబిరంలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.